క్లుప్తంగా

నేడు హోం మంత్రి పర్యటన

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం ఉదయం పట్టణంలోని సత్యవతి నగర్‌లో పక్కా గృహాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే ఉదయం 11.30 గంటలకు తాళ్లపూడి మండలం పోచవరం గ్రామంలోని కోదండ రామాలయంలో నిర్వహించే విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొంటారు.

పెరవలి పీహెచ్‌సీలో వైద్య నిపుణుల సేవలు

పెరవలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా మూడో శుక్రవారం వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని ఆ పీహెచ్‌సీ వైద్యురాలు ఎ. కృష్ణవేణి తెలిపారు. వారి సేవలను ఈ ప్రాంత రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నెలా మూడో శుక్రవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఎముకల వైద్యుడు ఫణితేజ, 12 గంటల నుంచి 2 గంటల వరకు ప్రసూతి వైద్య నిపుణురాలు మృదుల, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు వసంత అందుబాటులో ఉంటారన్నారు.

అమ్మిగుంటలో అన్నసమారాధన

చాగల్లు: మండలంలో అమ్మిగుంట గ్రామంలో పాటెమ్మ తల్లి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా పాటెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ వారు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో 100 లీటర్ల పెరుగుతో చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,50,123 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు. పేర్కొన్నారు.

మద్దూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కొవ్వూరు: మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం మద్దూరు గ్రామంలో పారిశ్రామికవేత్త, టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు ఆవిష్కరించారు. గ్రామ నాయకుల సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు గృహ యోగం

- మండలంలో 2054 మందికి ఇళ్లు మంజూరు
- టీడీపీ హయాంలో కేటాయించినవి 1654 మాత్రమే
- వారిలో 164 గృహ లబ్ధిదారులకు అందని బిల్లులు
- నాడు ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు నేడు రూ.1.80 లక్షలు
- జగనన్న కాలనీల్లో పేదల కళ్లల్లో సంతోషం



పెరవలి లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు



కానూరు లేఅవుట్‌లో తుది దశలో ఉన్న గృహాలు

పెరవలి: నిరుపేదల సొంతింటి కలను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేస్తోంది. అర్హులందరికీ స్థలాల పంపిణీతో పాటు సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు పక్కా గృహాలు మంజూరు చేస్తోంది. అంతే గాకుండా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలకు యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. స్థలాల మెరక, రోడ్లు, మంచినీరు, విద్యుత్తు సరఫరా వంటి విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

నాడలా.. నేడిలా..

తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న 2014- 2019 కాలంలో పెరవలి మండలంలో కేవలం 1,654 మందికి మాత్రమే పక్కా గృహాలు మంజూరు చేశారు. వాటిలో గృహాలు నిర్మించుకున్న 164 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. ఇక వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి మూడేళ్లలోనే 2,054 మంది పేదలకు ఇళ్లను మంజూరు చేశారు. వారిలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 1348 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇప్పటికే బిల్లులు చెల్లించింది. అదీగాకుండా గత ప్రభుత్వంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షల చొప్పున ఇస్తే, ప్రస్తుత ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేస్తోంది. అక్కడితో ఊరుకోకుండా రూపుదిద్దుకుంటున్న కాలనీలకు వెనువెంటనే ప్రాథమిక వసతులు కల్పిస్తోంది.

సబ్సిడీపై నిర్మాణ సామగ్రి

ఇంటి నిర్మాణ సమయంలో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. సిమెంట్, ఇసుక, గుమ్మాలు, కిటికీలు, అవసరమైన వారికి స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై అందిస్తోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు జాప్యం చేయకుండా నిర్మాణాలకు అందించిన మెటీరియల్ వ్యయాన్ని మినహాయించి, మిగతా మొత్తాన్ని మూడు దశల్లో బిల్లులుగా చెల్లిస్తున్నారు.ఇక ఇసుకను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. గృహ నిర్మాణ లబ్ధిదారుల్లో డ్వాక్రా సభ్యులు ఎవరైనా ఉంటే వారి పేరున స్వల్ప వడ్డీకి ప్రభుత్వమే రూ.40 వేల వరకూ బ్యాంకు రుణాలను కూడా ఇప్పిస్తోంది.

కొత్త గ్రామాల ఏర్పాటు

జగనన్న లే అవుట్లలో రూపుదిద్దుకుంటున్న కాలనీలు చూడముచ్చటగా ఉన్నాయి. ఒక్కో లేఅవుట్‌లో ఇంచుమించు వంద మంది లబ్ధిదారులు గృహాల నిర్మాణాలు జరుగుతుండడంతో కొత్తగా గ్రామాలు ఏర్పాటవుతున్నాయి.

మండలంలో జగనన్న గృహాల నిర్మాణ పురోగతి ఇలా..

మంజూరైన గృహాలు	2054
పునాదుల దశలో ఉన్నవి	174
గోడల వరకూ పూర్తయినవి	69
శ్లాబ్ వరకూ పూర్తయినవి	48
పూర్తయిన గృహాలు	1348
నిర్మాణం చేపట్టాల్సినవి	415

ఇంతటి సంక్షేమం నభూతో.. న భవిష్యతి



పేదలకు స్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్త గ్రామాల రూపకల్పనకు సృష్టికర్త అయ్యారు. ఇంతటి సంక్షేమం మరే ప్రభుత్వంలోనూ జరగలేదు, భవిష్యత్తులో జరగదు కూడా. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులతో త్వరతగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటున్నాం. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లులు విడుదల చేయిస్తున్నాం. ఇంతటి సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వంలో నేను భాగస్వామిని కావడం ఎంతో ఆనందంగా ఉంది.

–జి శ్రీనివాస్ నాయుడు ఎమ్మెల్యే నిడదవోలు

నెరవేరిన సొంతింటి కల



ఇంతకాలం అద్దె ఇళ్లలో కాలక్షేపం చేశాం.జగన్ ప్రభుత్వం వచ్చాన సొంత ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు సొంతింటిలో నివాసం ఎంతో ఆనందంగా ఉంది. ఎంతోకాలంగా ఎదురు చూసిన కల నెరవేరింది.

– వై రామదుర్గ, లబ్ధిదారు, తీపర్రు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని తొలుత ఇంటి స్థలం వచ్చింది. స్థలంతో పాటు తర్వాత పక్కా గృహం కూడా మంజూరైంది. దాదాపు పదేళ్లుగా అద్దె ఇళ్లలో నివశిస్తున్నాం. ఇప్పటికైనా సొంతిల్లు రావడం సంతోషదాయకం.

– గెద్దం జ్యోతి లబ్ధిదారు, ముక్కామల

పోచవరంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



కొత్తగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో భక్తులు

తాళ్లపూడి: పోచవరం గ్రామంలో కొత్తగా నిర్మించిన కోదండ రామాలయంలో సీతా రామచంద్ర లక్ష్మణ, హనుమాన్ సమేత రామచంద్ర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ పూజలు రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. వేద పండితుడు బ్రహ్మశ్రీ రావిపాటి వెంకటకట ప్రసాద్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, వాస్తు పూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, సహస్ర కలశాభిషేకం, క్షీరాదివాసం, నవగ్రహ హోమం నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన, అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొవ్వూరు: దేచెర్ల గ్రామానికి చెందిన మురిగుజ్జి రామాబాయి అనే మహిళ అదృశ్యమైంది. దీనిపై ఆమె భర్త నాగేశ్వరరావు ఆదివారం కొవ్వూరు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈ నెల ఐదో తేదీన రామాబాయి తన భర్తతో గొడవ పడింది. అనంతరం కూలి పనులకు అని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్టు నాగేశ్వరరావు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై కె.సతీష్ తెలిపారు.

నాలుగు రోజుల్లో మెరక పనులు పూర్తి

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ఖండవల్లి లేఅవుట్‌లో పనుల పరిశీలన



ఖండవల్లి లే అవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. అర్హులకు స్థలాలు ఇవ్వడంతో పాటు వాటిని మెరక చేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. ఖండవల్లి గ్రామంలోని జగనన్న లేఅవుట్ జరుగుతున్న మెరక పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ఖండవల్లిలో అతి పెద్ద లే అవుట్ వేశామని, మరో నాలుగు రోజుల్లో మెరక పనులు పూర్తి చేసి లబ్ధిదారుల ప్లాట్‌లకు నంబర్లు ఇస్తామన్నారు. ఈ గ్రామంలో 7.12 ఎకరాల విస్తీర్ణంలో వేసిన లే అవుట్‌లో 289 మందికి స్థలాలు కేటాయించామని చెప్పారు. మెరక పనులు పూర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, కందా వెంకన్న, చిన్నబాబు, ఎంపీటీసీ సభ్యుల బొకే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలగిరి మేరీమాత సేవలో మంత్రి వనిత



మేరీమాత స్వరూపం వద్ద 1,116 కొవ్వొత్తులు వెలిగిస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: గౌరీపట్నం వద్ద గల ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రమైన నిర్మలగిరి మేరీమాతను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ప్రధాన ద్వారం వద్ద గల మేరీమాత మండపంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి వనిత పాల్గొన్నారు. అనంతరం మేరీమాత మండపంలో ఆమె 1,116 కొవ్వొత్తులను వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకూ మంత్రి వనిత ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బండి అబ్బులు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆత్కూరి దొరయ్య, గంధ్రోతు సురేంద్ర, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కుదపా రాంబాబు, డాక్టర్ మహాలక్ష్మికుమార్, జ్యోతి ఆనంద్, జొన్నకూటి విజయ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

నిడదవోలు: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు విద్యార్థినులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నట్టు ఎంఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరయ్యే ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు విద్యార్థినులకు ఈ కిట్లను పంపిణీ చేస్తారని చెప్పారు.

భూముల సేద్యమునకు కౌలు హక్కునకు బహిరంగ వేలం ప్రకటన

[illegible]

వ. నెం.	భూమి ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెంట్లు	ధరావతు రూ.లు	కౌలు కాలము	బహిరంగ వేలం జరుగు ప్రదేశం,తేది,సమయం
1.	[illegible]	291/5	1-21	10000/-	2023-2024 2025-2026	[illegible]

వ. నెం.	భూమి ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెంట్లు	ధరావతు రూ.లు	కౌలు కాలము	బహిరంగ వేలం జరుగు ప్రదేశం,తేది,సమయం
1.	[illegible]	168	2-71	5000/-	2023-2024 2025-2026	[illegible]

వ. నెం.	భూమి ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెంట్లు	ధరావతు రూ.లు	కౌలు కాలము	బహిరంగ వేలం జరుగు ప్రదేశం,తేది,సమయం
1.	[illegible]	152	2-98	10000/-	2023-2024 2025-2026	[illegible] 20.06.2023 మంగళవారం [illegible]
2.	[illegible]	227/5 & 260/1	1-23 & 3 79	10000/-	2023-2024 2025-2026	

వ. నెం.	భూమి ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెంట్లు	ధరావతు రూ.లు	కౌలు కాలము	బహిరంగ వేలం జరుగు ప్రదేశం,తేది,సమయం
1.	[illegible]	170/1	2-88	5000/-	2023-2024 2025 2026	[illegible]
2.	గోపాలపురం	76	8 74	10000/	2023-2024 2025 2026	[illegible]
3.	[illegible]	374/1	0-71	5000/-	-do-	-do-

వ. నెం.	భూమి ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెంట్లు	ధరావతు రూ.లు	కౌలు కాలము	బహిరంగ వేలం జరుగు ప్రదేశం,తేది,సమయం
1.	[illegible]	314	16 00	50000/	2023 2024 2025-2026	[illegible]
2.	[illegible]	364	10-59	50000/-	-do-	-do-
3.	[illegible]	312	10-53	50000/-	-do-	-do-

వ. నెం.	భూమి ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణం ఎ.సెంట్లు	ధరావతు రూ.లు	కౌలు కాలము	బహిరంగ వేలం జరుగు ప్రదేశం,తేది,సమయం
1.	[illegible]	643	8-00	8000/-	2023-2024 2025-2026	[illegible]
2.	[illegible]	473/2	3-63	4000/-	-do-	-do-
3.	[illegible]	474/2	1 55	4000/	-do-	-do-

[illegible]

తేది.10-06-2023

కార్యనిర్వహణాధికారి

పోతవరం హైస్కూల్లో పూర్వ విద్యార్థుల భేటీ



1998-99 బ్యాచ్ పోతవరం హైస్కూల్ టెన్త్ విద్యార్థులు

నల్లజర్ల: పోతవరం హైస్కూల్ 1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అదే పాఠశాలలో జరిగింది. 24 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుని, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఖతార్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తున్న బోళ్ళ తులసీరామ్, తెలంగాణ రాష్ట్రంలో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న జగతి ఈశ్వరరావు, బుట్టాయిగూడెంలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న వై.లక్ష్మీకుమారి తదితరులు వచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తమతో పాటు చదువుకొని, ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న జయవరపు రమేష్ కుటుంబానికి ప్రతి నెలా కొంత ఆర్థిక సాయం చేయాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. తమతో చదువుకుని, ప్రస్తుతం పేదరికంతో ఇబ్బంది పడుతున్న వారి పిల్లల చదువులకు ఆర్థిక సహకారం అందించాలని, పాఠశాల అభివృద్ధి కృషి చేయాలని వారు తీర్మానించారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వై.రాజేంద్రప్రసాద్, ఐడీవీ అప్పారావు, రామిరెడ్డి పెద్దారెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, వేదకుమారి, చంద్రావతి, లక్ష్మిలను ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమం నిర్వాహకులు షేక్ సాకీర్, మట్టా శ్రీనివాస్, నల్లూరి రాజేష్, మీసాలనాగేశ్వరరావు, గన్నమని రమేష్, గోవాడ వెంకటేశ్వరరావులను ఈ బృందం అభినందించింది.

మెరిట్ విద్యార్థులకు 'మానవత' పురస్కారాలు



పురస్కారాలు పొందిన విద్యార్థులతో మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత సంస్థ మండల శాఖ ఆదివారం నల్లజర్లలో నగదు పురస్కారాలు అందజేసింది. అచ్యుత నాగవెంకట శివప్రసాద్‌కు రూ.5 వేలు, శెనగన మేఘనకు రూ.5 వేలు, మద్దిరెడ్డి వీర ఐశ్వర్యకు రూ.3 వేలు, యంత్రపాటి సంగీతకు రూ.3 వేల నగదు పురస్కారాలు అందించారు. ఈ నలుగురు విద్యార్థులకూ ప్రశంసాపత్రాలు, మెమెంటోలను మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి గంగాధరరావు, రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అందజేశారు. అంతేగాకుండా మెరిట్ విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న మేణ్ణి మాధవీలతకు ఫీజు నిమిత్తం రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి నాదెళ్ళ బులివెంకట్రావు, కోశాధికారి గుత్తికొండ ప్రసాద్, మండల శాఖ అధ్యక్షుడు గుళ్ళపూడి వెంకటరత్నం, భోగవల్లి వెంకటసుబ్బారావు, పాతూరి సత్యనారాయణ, దావులూరి చిరంజీవి, గుండు త్రినాథరావు, పీవీఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దేవరపల్లి: మండలంలోని యాదవోలు గ్రామానికి చెందిన నక్కా సత్యనారాయణ (సత్తియ్య- 40) అనే వ్యక్తి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం సత్యనారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో కుటుంబానికి భారం అవుతున్నాననే మనస్థాపంతో శనివారం అతడు ఇంట్లో ఉన్న సుమారు 50 టాబ్లెట్స్, రెండు సిరప్‌లు ఒకేసారి మింగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సత్యనారాయణను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

పిల్లల్లో విజ్ఞానాన్ని పెంచిన వేసవి శిబిరాలు

- మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి
- గ్రంథాలయాల్లో ముగిసిన శిక్షణ



కొవ్వూరులో బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తదితరులు



ముక్కామల గ్రంథాలయంలో ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులు

కొవ్వూరు: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు సత్ఫలితాలు ఇచ్చాయని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. 35 రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన విజ్ఞాన శిబిరాలు ముగిశాయి. ఈ క్రమంలో పట్టణంలోని గౌతమీనగర్ శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు నీతి కథలు, పుస్తకాలు చదవడం, యోగా, సంగీతం, కూచిపూడి నాట్యం, చిత్ర లేఖనం, క్రాఫ్ట్ వంటి వంటివి నేర్పించారని ఆమె అన్నారు. పలు విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి జీవీవీఎస్ త్రినాథరావు చెప్పారు. విజేతలకు చైర్‌పర్సన్ రత్నకుమారి, ఇతర అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. శిబిరానికి హాజరైన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, పాలకోడేటి సత్యనారాయణమూర్తి, రీసోర్స్‌పర్సన్లు టి.రాధాలక్ష్మి, సీహెచ్ వెంకటరాజు, ఎం.రమాదేవి, ఎంఎస్‌డీ శ్రీనివాస్, ఎం.దుర్గాభవాని, కె.వల్లి, ఎం.కనకదుర్గ, ఎస్.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పెరవలి: విద్యార్థులకు గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయి. ముగింపు సమావేశాలు ఆదివారం మండలంలోని పెరవలి, ముక్కామల, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో నిర్వహించారు. ముక్కామల గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వేంద్ర శ్రీను ప్రతిభ కనబరిచి, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమాల్లో కరుటూరి విశ్వనాథం, సలాది సూర్యనారాయణ, పెరవలి, తీపర్రు, ముక్కామల గ్రంథాలయల లైబ్రేరియన్లు వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వరరావు ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

చాగల్లులో..

చాగల్లు: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగిసింది. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సానబోయిన అర్జునరావు, రీసోర్స్‌పర్సన్ వి.గంగాధరం, గ్రంథాలయాధికారి గెద్దె శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థుల వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎ.నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.శిక్షణలో పాల్గొన్న 25 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో విజేత హైస్కూల్ ప్రధానోధ్యాయుడు జీవీ ప్రమోద్‌కుమార్, ఎం.సత్యనారాయణ, గెద్దం రాజ్‌కుమార్, రీడర్స్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.